నేడు నార్సింగిలో అయ్యప్ప మహాపడిపూజ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని కేవీఎంఆర్ గార్డన్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, అన్నదాత కె. వెంకటరమణరెడ్డి తెలిపారు. నార్సింగి నర్సింగ్‌రావు భజన, పడిపూజ అనంతరం అన్నదానం ఉంటుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ నెల 28 నుంచి మద్యం షాపులు బంద్

రాజేంద్రనగర్: ఎన్నికల నేపథ్యంలో శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైన్స్, బార్లు, కల్లు కంపౌండ్‌లను ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి మూసి వేస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి షాపులను తెరుస్తారని అన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, మద్యం నిలువ చేసినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలను ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 236 కేసులు నమోదు చేశామన్నారు. తమ ప్రాంతంలో మద్యం విక్రయించినా, డంప్ చేసినా ఫోన్ నంబర్ 8712658750లో ఫిర్యాదు చేయాలని కోరారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

అత్తాపూర్: విపరీతంగా మద్యం తాగిన ఓ వ్యక్తి రోడ్డుపై మృతి చెందాడు.ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...రాజేంద్రనగర్ నందిముస్లాయిగూడ ప్రాంతానికి చెందిన శివరాజ్ (30) బట్టల దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శివరాజ్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. ఈ నెల 22న ఉదయం శివరాజ్ బయటికి వెళ్ళి రాత్రి అయినా తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ నెల 23వ తేదీన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద విపరీతంగా మద్యం సేవించి శివరాజ్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.





షా..రోడ్ షో

రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రోడ్‌షో శుక్రవారం నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేపీ రాజేంద్రనగర్ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. - బండ్లగూడ

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు

బండ్లగూడ: రాజేంద్రనగర్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసే ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి గంగని రవికుమార్ తన అనుచరులు అరుణ్, గంగని నరేందర్, శ్యామ్, బాబు తదితరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. అదే విధంగా హిమాయత్‌సాగర్‌లో కాంగ్రెస్‌కు చెందిన మైనార్టీ నాయకులు మహమ్మద్ షాహిద్, సయ్యద్ హాజీ, షకీల్ హుస్సేన్, మహ్మద్ షాహిద్‌ఖాన్, మహ్మద్ అబ్దుల్లా, రహమాన్, పాషా, షేక్ సమీర్, గౌస్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరు బీఆర్‌ఎస్‌కే మద్దతు ఇస్తున్నారన్నారు. గతంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమాలను చూసి ప్రజలు, వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. మరోసారి భారీ మెజార్టీతో విజయం సాధించనున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ రాందాస్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు గోపాల్‌ముదిరాజ్, సుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాశ్ గౌడ్

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

అత్తాపూర్: రాజేంద్రనగర్‌లో మళ్లీ గెలుపు తనదేనని ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఆయన మాట్లాడారు. తాను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో తనకు పోటీయే లేదని ఆయన అన్నారు. తాను ఎమ్మెల్యే కాకముందు ఇప్పుడు నియోజకవర్గం రూపురేఖలు సమూల మార్పులు వచ్చాయని.. ఆది జనానికి తెలుసునని.. అవే తన గెలుపునకు బాటలు వేస్తాయన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కార్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఆయన తెలిపారు. అభివృద్ధి క్రమం నిలిచి పోకూడదని జనం కోరుకుంటున్నారన్నారు. అభివృద్ధి నిరోధకులు, మత రాజకీయాలు చేసే సంఘం విద్రోహ శక్తులకు రాజేంద్రనగర్‌లో స్థానం లేదని పేర్కొన్నారు. పదేళ్లుగా నగరం ఎలాంటి అల్లర్లు, మత ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ఉందన్నారు. ఈ ప్రశాంతతను కోరుకుంటున్న ప్రజలు మళ్లీ తననే గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

జోరుగా సాగిన ఎమ్మెల్యే ప్రచారం..

శంషాబాద్ రూరల్: నియోజకవర్గం అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ కోరారు. శుక్రవారం మండలంలోని పెద్దతూప్ర, పెద్దతూప్రతండా, పాల్మాకుల, మదన్‌పల్లి, మదన్‌పల్లితండా, మేకలబండాతండా, ముచ్చింతల్, బుర్జుగడ్డ తండా, ఘాంసిమియాగూడ, గండిగూడ, పిల్లోనిగూడ, జూకల్, పెద్దషాపూర్, ఎర్రకుంట తండా, అలీకోల్‌తండాలో రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన కమిషనింగ్ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. నియోజకవర్గ పరిధిలోని 542 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలలో పార్టీ పేరు, అభ్యర్థుల పేర్లు, గుర్తులతో కూడిన వివరాలను అప్ లోడింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి మల్లయ్య ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పోటీలో నిలిచిన అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 542 ఈవీఎంలతో పాటు అదనంగా 20 శాతం ఈవీఎంలలో పోలింగ్‌కు వినియోగించనున్నారు. కమిషనింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో ఓటింగ్‌ను నిర్వహించి అనంతరం వాటిని లెక్కించారు. ప్రతినిధులంతా ఈ ప్రక్రియ సక్రమంగా జరిగిందని నిర్ధారించి సంతకాలు చేసిన అనంతరం ఈవీఎంలకు సీల్ వేసి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈ స్ట్రాంగ్ రూమ్ రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ స్ట్రాంగ్ రూమ్ ఈ నెల 29వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి పోలింగ్ బూత్‌లకు తరలించనున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 24 గంటల పాటు పోలీసు పహారాను కొనసాగిస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌తో పాటు పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

అత్తాపూర్: డివిజన్ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా ఖాజానగర్, వీకర్ సెక్షన్ బస్తీతో పాటు పలు కాలనీల్లో రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాశ్ గౌడ్‌కు మద్దతుగా, పార్టీ నాయకులు కారు గుర్తుకే మన ఓటు అని చెబుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ మెనిఫెస్టో కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, శివారెడ్డి, దుంపల రాజు, కామసాని మహేందర్ రెడ్డి, కావలి శేఖర్, సేగురి అర్జున్ రెడ్డి, పీయం రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, ఎర్ర మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశ్‌గౌడ్ గెలుపును ఆపలేరు



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహా, ముక్తార్‌పాష

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ గెలుపును ఆపే సత్తా ఎవరికీ లేదని, ఆయన గెలుపు ఇప్పటికే కరారయ్యిందని, భారీ మెజార్టీకే కృషి చేస్తున్నామని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేష్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహా, బీఆర్‌ఎస్ నాయకులు ముక్తార్‌పాషలు పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో అన్ని వర్గాల వారి మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకి ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీతో ప్రకాశ్‌గౌడ్ నాలుగోసారి గెలుపు ఖాయమన్నారు. ప్రచారంలో నాగరాజు, రాజు, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే కబ్జాలుండవు.. అభివృద్ధి మాత్రమే



శంషాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ ముదిరాజ్

శంషాబాద్: బీఆర్‌ఎస్ పాలనంతా భూ కబ్జాలమయం.. కాంగ్రెస్ వస్తేనే సంక్షేమంతో పాటు అభివృద్ధి జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని రైల్వే గేటు నుంచి ప్రారంభమైన రోడ్ కాపుగడ్డ, యాదవ్ బస్తీ, అహ్మద్‌నగర్, ఖాజీగల్లి, పోచమ్మగడ్డ, వెంగళ్రావు కాలనీ, సాతంరాయిలో జరిగిన రోడ్ షోకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదిహేనేళ్ల ఎమ్మెల్యే పనిచేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి పాలనలో రాజేంద్రనగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనకబడిపోయిందన్నారు.

ప్రపంచాన్ని మార్చేస్తున్న కృత్రిమ మేధస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

మణికొండ: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మన ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తుందని, హెల్త్‌కేర్, మొబిలిటి, ఫైనాన్స్, అర్బన్ కాంటెక్స్ల వంటి కీలక రంగాల ల్యాండ్‌స్కేప్‌ను అది మారుస్తుందని ఇండియన్ ఇన్నోవేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐనంపూడి సుబ్బారావు అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో వెబ్, సోషల్ మీడియాపై ఈఏఐ, స్ప్రింగర్ వారి రెండు రోజుల రెండవ అంతర్జాతీయ సమావేశం శుక్రవారం ప్రారంభమయ్యింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జియోట్యాగ్ చేయబడిన సామాజిక డేటా యొక్క పెరుగుతున్న లభ్యత, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ అల్గారిథమ్‌లు వేగవంతంగా పురోగతి సాధిస్తున్నాయన్నారు. ఏఐ, పెద్ద డేటా విశ్లేషణలు ప్రారంభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా టెక్నికల్ ఏపీఏసీ రీజినల్ సొల్యూషన్స్ డైరెక్టర్ టి. శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వినాయకనగర్‌లో బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



వినాయక నగర్‌లో ప్రచారం చేస్తున్న ప్రేమ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్‌లో ప్రకాష్‌గౌడ్ చేసిన సేవలు మరువరాదని ,నాలుగోసారి అసెంబ్లీకి పంపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయించుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు టి ప్రేమ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వినాయకనగర్‌లో కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టి ప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ..మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రజలకు ప్రకాష్‌గౌడ్ ఎనలేని సేవ చేశాడని అన్నారు. పిలిచిన వెంటనే పలికే నాయకుడు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అని ప్రజలకు సూచించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజా రిటీ ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో టి సుధాకర్ రెడ్డి, లక్ష్మరెడ్డి, శ్రీకాంత్, బాల క్రిష్ణ, మహేందర్, జహంగీర్, శ్రీనివాస్‌రెడ్డి, నరహరి పాల్గొన్నారు.

హస్తం హవాలో కారు మటుమాయం: నాగేందర్ రెడ్డి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొండకళ్ల నాగేందర్ రెడ్డి తదితరులు

అత్తాపూర్: తెలంగాణలో ప్రభుత్వం పై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతుందని టీపీసీసీ నాయకులు కొండకళ్ల నాగేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇస్తే దాన్ని అడ్డు పెట్టుకొని కేసీఆర్, ఆయన కుటుంబం రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశించిన తెలంగాణ ఇది కాదన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు ఈసారి తెలంగాణ సమాజం అధికారం ఇవ్వబోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 80కి పైగా నియజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అవినీతిపరుడిగా మారిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ చిత్తుగా ఓడిపోతున్నాడని ఆయన జోస్యం చెప్పారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'ది సైన్స్ ఆఫ్ స్లీప్' అనే అంశంపై ప్రముఖ లైఫ్ కోచ్, మెడిటేషన్ గైడ్ బి.కె. డాక్టర్ స్వామినాథన్ ఉపన్యాసం ఇస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

28న 'సంకల్ప్ దివస్–2023'

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలోని సాంప్రదాయవేదికపై ఈ నెల 28వ తేదీన 'సంకల్ప్ దివస్–2023' నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలలో ఒకటైన సుచిర్ ఇండియా సీఎస్ఆర్ విభాగమైన సుచిత ఇండియా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన సంకల్ప్ కిరణ్ పురస్కార్ అవార్డు, మానవతావాది లయన్ డాక్టర్ వై కిరణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పద్మవిభూషణ్ మేరీకోమ్‌కు అవార్డు అందించి సత్కరిస్తామని సుచిర్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై కిరణ్ తెలిపారు.

జూపార్కును సందర్శించిన ఎం.సి.పర్గేయన్

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కును శుక్రవారం వైల్డ్‌లైఫ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎం.సి.పర్గేయన్ సందర్శించారు. ఈ సందర్భంగా జూపార్కులోని వన్యప్రాణుల ఆరోగ్య పరిస్థితి, జూ నిర్వహణ తదితర వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు జూపార్కుల డైరెక్టర్ వీఎస్ఎన్‌వీ ప్రసాద్, క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరేమత్ స్వాగతం పలికారు. అనంతరం జూపార్కులో జరిగిన అభివృద్ధి పనులు, జంతువు మార్పిడి, ఎన్‌క్లోజర్‌ల సునంపన్నం, జపార్కు జంతువుల ఆరోగ్య నిర్వాహణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూపార్కులో వైల్డ్‌లైఫ్ హాస్పిటల్, ఫీడ్ స్టోర్, వన్యప్రాణుల సంరక్షణ, సంరక్షణ కోసం జూపార్కు అధికారులు చర్యలు ఎంతో అభినందనీయమన్నారు.

యువకుడి అదృశ్యం



షేక్ ఒవైసీ

గౌలిపురా: స్నేహితుని ఇంటికి వెళ్లిన ఓ యువకుడు కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ఆమన్‌నగర్–బీ ప్రాంతానికి చెందిన షేక్ మునావర్ కుమారుడు షేక్ ఒవైసీ (18) ఈనెల 20న సాయంత్రం 4 గంటల సమయంలో స్నేహితుని ఇంటికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీనిపై తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

మణికొండ: పేదరికంలో ఉన్నా ఉన్నత చదువులు చదువుకోవాలని ఇష్టంగా ఉన్న విద్యార్థులను తమ సంస్థ ఆదుకుంటుందని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఇంజనీరింగ్ చదువుకుంటున్న లోహిత్‌కు శుక్రవారం ఆయన రూ.10వేల చెక్కును ఆర్థిక సహాయంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి వారికి ఉన్నత చదువులు చదువుకునే అవకాశాలను ప్రభుత్వాలు ఉచితంగా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

'ఒక్కసారి అవకాశం కల్పించండి'



ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయాలో తెలియని వారికి మూడు సార్లు అవకాశం ఇచ్చారు. ఒక్కసారి యువకుడినైన తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చి చూడండి అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానని రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసిన గోతులతో కూడిన రోడ్లు, పొంగిపొర్లుతూ కనిపించే డ్రైనేజీలు ఆయన చేసిన అభివృద్ధా ఇని ప్రశ్నించారు. గత పదిహేను సంవత్సరాల నుంచి తన ఆస్తులను అభివృద్ధి చేస్తున్నారు తప్ప ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఏనాడు పట్టించుకొలేదని విమర్శించారు.

మణికొండ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



మణికొండలో ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్ పురుషోత్తం తదితరులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీని చైర్మెన్‌గా అభివృద్ధి చేసినట్టే రాబోయే రోజుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్ యాదవ్, పార్టీ వర్కింగ్ కమిటి అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పార్టీ కౌన్సిలర్‌లు, శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సార్లు ఎమ్మెల్యేగా, పది సంవత్సరాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నా రాజేంద్రనగర్ అనుకున్న స్థాయిలో అభివృద్ధి సాధించలేదన్నారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, ప్రజలు ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో చెయ్యి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

శిల్పారామంలో సిద్ధేంద్రయోగి ఆరాధనోత్సవాలు

మాదాపూర్: శిల్పారామంలో సిద్ధేంద్రయోగి ఆరాధనోత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. భరతవేద ఆర్ట్స్ అసోసియేషన్ గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ శిష్యులతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత అచార్యులు డాక్టర్ భాగవతుల సేతురాం పాల్గొన్నారు. కళాకారులు నటేశకౌతం, జావళి, మూషికవాహన, రామాయణశబ్దం, అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు తదితర అంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.



కాంగ్రెస్, సీపీఐ నాయకుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ, రాజేంద్రనగర్, బుద్వేల్‌లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు కోరని శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు హాజరయ్యారు. ప్రస్తుతం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. తాము ఎక్కడికి వెళ్లినా పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ను గెలిపిస్తామని తెలుపుతున్నారన్నారు.

అమిత్ షాకు భగవద్గీత అందజేత



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రోడ్‌షోలో పాల్గొనేందుకు శుక్రవారం నగరానికి వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు బీజేపీ నాయకులు సాబాద విజయ్ కుమార్ తదితరులు భగవద్గీతను అందజేశారు. పార్టీ విజయానికి కృషిచేయాలని ఈ సందర్భంగా అమిత్‌షా నాయకులను సూచించారు.

ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ ఏర్పాటు

స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన అధికారులు



బంజారాహిల్స్: ఎన్నికల పర్వంలో మరో కీలక ఘట్టమైన ఈవీఎంల కమిషనింగ్ (బ్యాలెట్ పత్రం ఏర్పాటు, నమూనా పోలింగ్) ప్రక్రియ శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ముగిసింది. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్‌లో గురువారం నుంచి స్ట్రాంగ్‌రూమ్‌లలో ఈవీఎంల కమిషనింగ్ కొనసాగింది. ఈసీఐఎల్ ఇంజినీర్ల పర్యవేక్షణలో అభ్యర్థులు, వారి ఏజెంట్ల ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారులు కమిషనింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈవీఎంలలో భాగాలైన బ్యాలట్ యూనిట్‌కు, కంట్రోల్ యూనిట్‌కు, వీవీ ప్యాట్‌కు పోలింగ్ కేంద్రం చిరునామా ట్యాగ్‌లను అమర్చడం ద్వారా ఈ ప్రక్రియను ఖైరతాబాద్ ఆర్‌వో వెంకటేష్ ధోత్రే ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిషనింగ్ ప్రక్రియలో భాగంగా ఈసీఐఎల్ ఇంజినీర్లు వీవీ ప్యాట్‌లో బ్యాటరీ, పేపర్ రోల్ అమర్చి గుర్తులను లోడ్ చేశారు. అనంతరం ప్రింట్‌ను ఆర్‌వో పరిశీలించారు. దీని తర్వాత బ్యాలెట్ యూనిట్‌లోని పరికరాలన్నీ అసలైనవేనని ఇంజినీర్లు నిర్ధారించారు. ప్రతి బ్యాలెట్ కాగితం వెనుక ఆర్‌వో సంతకం చేసి బ్యాలెట్ యూనిట్‌లోని తెరను తెరిచి కాగితాన్ని అమర్చి అనంతరం వాటికి సీల్‌వేశారు. దీని తర్వాత కంట్రోల్ యూనిట్‌లో బ్యాటరీలను అమర్చారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లు అనుసంధానం చేసిన తర్వాత కంట్రోల్ యూనిట్ స్విచ్ ఆన్ చేసి నమూనా పోలింగ్ నిర్వహించారు. నమూనా పోలింగ్‌లో భాగంగా ప్రతీ అభ్యర్థితో పాటు నోటాకు సైతం ఒక ఓటు చొప్పున వేసి కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్లలోని ఫలితాలను పోల్చి చూశారు. నమూనా పోలింగ్ డేటాను సేకరించి పేపర్ రోల్ లాక్ చేసి వీవీ ప్యాట్ అనుసంధానించడం ద్వారా ఈ ప్రక్రియ ముగిసింది.